సాక్షి కామారెడ్డి

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



ఫుట్‌పాత్ నిర్మాణానికి..

కామారెడ్డి పట్టణంలో ఫుట్‌పాత్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడేళ్లయినా పనుల ఊసే లేదు. డ్రెయినేజీలు నిర్మించి వదిలేశారు.

- 9లో ▸



ప్రపంచానికి మన సంస్కృతి..

ప్రపంచానికి భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు ఆదర్శంగా ఉన్నాయని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యకారిణి సాయినాథ్ అన్నారు.

- 9లో ▸

వాతావరణం


గరిష్టం/కనిష్టం
34.8 /22.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. అక్కడక్కడ తేలిక పాటి జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఆరోగ్య ఐశ్వర్యవంతులు!

ఆరోగ్యమే ఐశ్వర్యమని.. నిరూపిస్తున్నారు పలువురు వృద్ధులు. తొంభై ఏళ్లు దాటినా నేటి తరానికి ఏ మాత్రం తీసిపోకుండా పోటీపడి తమ పనులు తామే చేసుకుంటున్నారు. తీసుకునే ఆహారం, మంచి అలవాట్లే తమను ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంచుతున్నాయని అంటున్నారు. తొంభై ఏళ్ల చలాకీ వృద్ధులపై 'సాక్షి' సండే స్పెషల్..

- వృద్ధాప్యంలోనూ అదే చురుకుదనం
- తమ పనులు తామే చేసుకుంటున్న వృద్ధులు
- వారి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో..



సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తమ కడుపున పుట్టిన వాళ్లు వృద్ధాప్యంలోకి వచ్చినా, వాళ్లు మాత్రం ఇప్పటికీ తమ పనులు తామే చేసుకుంటూ ఓ రకంగా ఆరోగ్య ఐశ్వర్యవంతులు అనిపించుకుంటున్నారు. ఆరోగ్యంతో ఉన్న వాళ్ల కన్నా ఐశ్వర్యవంతులెవరూ ఉండరని మొన్నటి కరోనా మహమ్మారి రుజువు చేసింది కదా! నేటి తరం ముప్పై, నలభై ఏళ్ల వయసులోనే బీపీ, షుగర్‌లతో సహవాసం చేస్తూ, యాభై ఏళ్లకే వృద్ధులైనట్టుగా తయారవుతున్న పరిస్థితుల్లో ఎనభై, తొంభై దాటినా కొందరు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నారు. దానికి కారణం వారి ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమకు తోడు ఒత్తిడి లేని జీవనం గడపడమే. వాళ్ల నుంచి నేటి తరం నేర్చుకునేది ఎంతో ఉందని స్పష్టమవుతోంది.

నడకే ఆరోగ్య రహస్యం

ఎల్లారెడ్డి మండలం మౌలాన్‌ఖేడ్ గ్రామానికి చెందిన పిట్ల రాములుకు ఇప్పుడు తొంభై ఏళ్లు. ఎక్కడికి వెళ్లినా చిన్నప్పటి నుంచి నడిచి వెళ్లడం అలవాటు. ఇప్పటికీ ఆయన మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న ఎల్లారెడ్డి పట్టణానికి కాలినడకన వెళ్తారు. మనవళ్లు బండి మీద వెళ్దామన్నా నడిచే వెళ్తానంటాడు. ఈ వయస్సులోనూ అంగడి రోజు కచ్చితంగా ఎల్లారెడ్డికి నడిచి వెళ్లాల్సిందే. చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేసే అలవాటు ఉన్న రాములు ఆరోగ్యంగా ఉన్నారు.



సొంతంగా కారు నడుపుతూ..

భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన ఎడ్ల రాజిరెడ్డి వయసు 93 ఏళ్లు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పనిచేసిన ఆయనకు సాదాసీదాగా జీవించడం అలవాటు. ఎటు వెళ్లాలన్నా ఈ వయసులోనూ సొంతంగా కారు నడుపుకుంటూ వెళ్తారు. గతంలో తాను మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్నానని, మూడు రోజుల్లోనే యథావిధిగా నడవడంతో వైద్యులే ఆశ్చర్యపోయారని అంటున్నారు రాజిరెడ్డి. మీ ఆరోగ్యరహస్యం ఏమిటని ఎవరడిగినా పొద్దున పొలం దగ్గరకు వెళ్లి వచ్చి, స్నానం చేయగానే చలిబువ్వ ఇంత తిని బయటపడతానని చెబుతాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండడమే తన ఆరోగ్యరహస్యమంటున్నారు.



రెండు తక్కువ నూరు..

తన వయస్సు రెండు తక్కువ నూరు అని చెబుతోంది భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన అలీమా బీ. అంటే 98 ఏళ్ల వయస్సులోనూ అలీమా బీఇప్పటికీ ఆరోగ్యంగా ఉంది. తన పని తాను చేసుకుంటోంది. చిన్నప్పటి నుంచి ధనియాలపప్పు, ఓమ తినే అలవాటుందని చెబుతోంది. అందుకే ఏ సమస్యా లేదని, ఇప్పటికీ ప్రతీ రోజూ ధనియాలపప్పు, ఓమ తింటున్నానని.. ఎప్పుడూ ఏ విషయంలోనూ రంది లేకుండా ఉండే ప్రయత్నం చేస్తానని అంటోంది.



తన పని తాను చేసుకుంటూ..

లింగంపేట మండలం అయ్యపల్లికి చెంది నర్యాల మడుగు మల్లవ్వ వయసు 95 ఏళ్లు. ఇప్పటి కీ తన పనులు తాను చేసుకుంటుంది. వంటింట్లో కుటుంబ సభ్యులకు ఆసరా అవుతుంది. బతుకమ్మ పండగ సందర్భంగా గ్రామస్తులు మల్లవ్వను సన్మానించారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉండడానికి కారణం మొదటి నుంచి కష్టపడి పనిచేయడం, ఏది ఉంటే అది తినడమే అంటోంది మల్లవ్వ.



తొంబై దాటినా ఆరోగ్యంగా...

ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామానికి చెందిన నీరుడి సత్తవ్వ వయసు 92 ఏళ్లు. తన పనులు తానే చేసుకుంటోంది. కష్టపడిన రెక్కలు కాబట్టి ఏ ఇబ్బందీ లేకుండా ఉన్నామని చెబుతోంది. కొడుకులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు. తన పనులన్నీ తానే చేసుకుంటుంది. ఏ ఇబ్బంది లేకుండా ఉందని చెబుతోంది.



న్యూస్‌రీల్

'జల విలయం' పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్ : జిల్లాలో వర్ష బీభత్సం, భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పలువురు కవులు 'జల విలయం' కవితల పుస్తకాన్ని రచించారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ శనివారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. 28 మంది కవులు తమ భావాలను కవితలు, వ్యాసాల రూపంలో చక్కగా వివరించారని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్ వెంకటి, కే శ్రీనివాస్ అన్నారు. తెరవే ప్రతినిధులు మోహన్‌రాజ్, గంగాప్రసాద్, మంద పీతాంబర్, బి నాగభూషణం, కాసర్ల రామచంద్రం, సంగాగౌడ్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించాలి



కామారెడ్డి అర్బన్ : రైతులు తమ వ్యవసాయ బోర్లకు తప్పని సరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని, సొంతంగా విద్యుత్ సంబంధిత పనులు చేయొద్దని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కే శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని టేక్రియాల్ శివారులో విద్యుత్‌శాఖ-పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఈ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. టేక్రియాల్ మాజీ సర్పంచ్ శంకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ కుంటి ఆంజనేయులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి శనివారం మండలంలో పర్యటించారు. ఏవో యాదగిరితో కలిసి ప ర్యటించిన ఆయన క్షేత్రస్థాయిలో వరి, పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు, నిల్వలను పరిశీలించారు. వరిలో మెడవిరుపు, ఎండాకుతెగులు, పత్తిలో రసం పీల్చే పురుగు ఉన్నట్లు గుర్తించి సస్యరక్షణ కోసం రైతులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈవో ఆరతి, రైతులు న్నారు.



దోమకొండ మండలం గొట్టిముక్కులలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ సంగ్వాన్

జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- అవసరమైన ఏర్పాట్లు చేశాం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- గొట్టిముక్కలలో కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

దోమకొండ : వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 194 ఐకేపీ సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంట చేతికి వచ్చినందున ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రాలకు అవసరమైన టార్పాలిన్ కవర్లు, వేయింగ్ మిషన్లు, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులను సమకూర్చినట్లు తెలిపారు. ధాన్యం డబ్బులు వెంటవెంటనే రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సౌకర్యం కోసం మరుగుదొడ్లు, విద్యుత్‌తోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులను దృష్టిలో పెట్టుకుని ర్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. సత్వరమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సురేందర్, డీసీఎస్‌వో వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సుధాకర్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

నాగిరెడ్డిపేట/గాంధారి : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో పర్యటించనున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మంజీర పరీవాహక ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలను హరీశ్‌రావు పరిశీలిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిద్దయ్య శనివారం తెలిపారు. వరద కారణంగా పంట నష్టపోయిన రైతులతో మంత్రి మాట్లాడుతారని, అలాగే పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తారన్నారు.

గాంధారి మండలకేంద్రంలో నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొంటారని ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యం, పార్టీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన నాయకుల బీఆర్‌ఎస్‌లో చేరుతారని పేర్కొన్నారు. సింగిల్ విండో కార్యాలయం నుంచి హరాళే గార్డెన్ వరకు బైక్ ర్యాలీ అనంతరం కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు.



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదు

కామారెడ్డి క్రైం : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. దసరా రోజు అర్ధ రాత్రి సమయంలో జిల్లా కేంద్రంలో కలకలం రేపిన ఇరు వర్గాల ఘర్షణ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం తన కార్యాలయంలో ఏఎస్పీ వెల్లడించారు. ఘర్షణ జరిగినట్లు గురువారం అర్ధరాత్రి డయల్ 100కు సమాచారం రాగా, వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నామన్నారు. అప్పటికే రెండు గ్రూప్‌లు కొట్టుకుంటుండగా చెదరగొట్టి ఇళ్లకు పంపించి వేశామని తెలిపారు. అదే సమయంలో కేతన్, ప్రఫుల్ అనే ఇద్దరు యువకులపై సిద్ధార్థ్ అనే యువకుడు గాజు ముక్కతో దాడి చేసినట్లు గుర్తించామని, వారి మధ్య ఉన్న పాత కక్షల కారణంగానే దాడులు చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ దాడుల్లో మొత్తం నలుగురికి గాయాలైనట్లు వెల్లడించారు. సిద్ధార్థ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏఎస్పీ తెలిపారు. అర్ధరాత్రి తరువాత గుంపులుగా ఏర్పడటం, కాలనీల్లో సంచరించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం చేసే వారిని ఇకపై ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

పిల్లలకు టీకాలు వేయించాలి

పిట్లం(జుక్కల్): పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి విద్య సూచించారు. మండలంలోని బండపల్లి గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ తేదీ ప్రకారం టీకాలు వేయించాలన్నారు. అలాగే చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. సెంటర్‌లోని పలు రికార్డులను పరిశీలించిన ఆమె.. సమయపాలన పాటించాలని, సెంటర్‌కు వచ్చే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దయానంద్, సిబ్బంది స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సబ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న విద్య

ఆశలన్నీ వరి పైనే..

- జిల్లాలో 3.18 లక్షల ఎకరాల్లో సాగు
- ప్రస్తుతానికి ఆశాజనకంగా పంట
- వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు

కామారెడ్డి క్రైం : ఈ ఏడాది అవసరానికి మించి వానలు కురవడంతోపాటు వరదలకు పలు రకాల పంటలు దెబ్బతిని జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ముఖ్యంగా సోయాబీన్, పత్తి, మినుము, పెసర, కూరగాయల పంటలను రైతులు చాలామట్టుకు నష్టపోయారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్క వరి పంట మాత్రమే ఆశాజనకంగా కనిపిస్తోంది. దీంతో రైతులు ఆశలన్నీ వరిపైనే పెట్టుకున్నారు. ఇకనుంచైనా వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు రావొచ్చని భావిస్తున్నారు.

వాతావరణం అనుకూలిస్తేనే..

భారీ వర్షాలు, వరదలకు జిల్లాలో మొత్తం 26,214 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వాటిలో 14,547 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగింది. మొన్నటి వరకు జిల్లాను వర్షాలు వదల్లేదు. వారం రోజులుగా వానలు లేకపోవడంతో ఇప్పుడే రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కోత దశలో మళ్లీ వర్షాలు మొదలైతే మాత్రం రైతులకు కష్టాలు తప్పవు. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిస్తే మాత్రం దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఆకాశం మేఘావృతమైన సమయాల్లో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు సకాలంలో మెలకువలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో వరి సాగు మాత్రం ఆశాజనకంగా కనిపిస్తోంది. ఇతర పంటలు అంతంత మాత్రంగానే ఉన్న తరుణంలో రైతుల ఆశలన్నీ వరిపైనే ఉన్నాయి. వాతావరణం సహకరించాలని రైతులు కోరుకుంటున్నారు.



దాదాపు లక్ష ఎకరాల్లో వరి..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 5.42 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. వాటిలో 3.18 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, దీంట్లో దాదాపు లక్ష ఎకరాల్లో సన్న రకాలు ఉన్నాయి. ఆగస్టు చివర్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు వరి నీట మునిగినా నీళ్లు తగ్గిన తర్వాత పంట తేరుకుంది. ఇసుక మేటలు వేసిన ప్రాంతాలు మినహా మిగతా చోట్ల నష్టం తక్కువగానే కనిపించిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కంకి ఏర్పడి పాలు పోసుకుంటున్న దశలో వరి పంట ఉంది. ముందుగా నాట్లు పడిన బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్ మండలాల పరిధిలో కోత దశకు సైతం చేరుకుంటోంది.

జాగ్రత్తలు పాటించాలి

వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలి. చీడపీడల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. – మోహన్ రెడ్డి, డీఏవో, కామారెడ్డి



మీనం దళారుల పాలు

- గతేడాది చెరువుల్లో విడుదల చేసిన సబ్సిడీ చేపలు
- దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్న మత్స్యకారులు
- పట్టించుకోని మత్స్య శాఖ అధికారులు

బాన్సువాడ : మీనం దళారుల పాలవుతోంది. మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడంతోపాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసి చెరువుల్లో విడుదల చేసింది. చెరువుల్లో పెరిగిన చేపలను మత్స్య కారులే స్వయంగా గ్రామాల్లో విక్రయించేందుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై టాటా ఏస్‌లు, ఎక్సెల్‌లను అందజేసింది. అయితే గ్రామీణ ప్రాంతాల మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు లబ్ధిపొందుతున్నారు. గతేడాది జిల్లాలో ఉన్న 798 చెరువుల్లో కోటీ 45 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంకా చేప పిల్లలను విడుదల చేయకపోవడంతో చెరువుల్లో పెరిగిన చేపలను మత్స్యకారులు పట్టి దళారులకు కిలోకు రూ.40 నుంచి రూ.60కే విక్రయిస్తూ నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం దళారులు రూ.110 నుంచి రూ.130 వరకు విక్రయిస్తూ లబ్ధిపొందుతున్నారు. మత్స్యకారుల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారై ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఓ సందర్భంలో మండలంలోని కోనాపూర్ చెరువులో మత్స్యకారులు పట్టిన చేపలను దళారికి విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి దళారిపై కేసు పెట్టించారు. స్థానిక మత్స్యకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం బాన్సువాడ కల్కి చెరువులో పెరిగిన చేపలను మత్స్యకారులు హైదరాబాద్‌కు చెందిన దళారికి విక్రయించారు. ఈ విషయం మత్స్యశాఖ అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. డివిజన్‌లో చెరువులను పర్యవేక్షించాల్సిన అధికారి ఏనాడూ వచ్చి చెరువును చూసిన దాఖలాలు లేవని మత్స్యకారులు అంటున్నారు. వానాకాలం, ఎండాకాలం, చలి కాలం తామే చెరువులను కాపాలా కాస్తున్నామని మత్స్యకారులు పేర్కొంటున్నారు. మత్స్య సహకార పారిశ్రామిక సంఘాల బలోపేతం, కొత్త సభ్యుల చేరికలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కల్కి చెరువు వద్ద చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు



గతేడాది బాన్సువాడ కల్కి చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

చెరువులు (ప్రాజెక్టులు : నిజాంసాగర్, కౌలాస్)	798
పారిశ్రామిక సహకార సంఘాలు	225
సభ్యులు	15వేలు
గతేడాది ప్రభుత్వం చెరువుల్లో విడుదల చేసిన చేప పిల్లలు	1.45 కోట్లు
చేపల రకాలు :	బొచ్చ, రవుఫ్, మిర్గమ్, బంగారుతీగ, కొర్రమీను

దళారులకు అమ్మకుండా చర్యలు

చెరువుల్లో సబ్సిడీపై విడుదల చేసిన చేపలు మత్స్యకారులే పట్టుకుని విక్రయించాలి. బాన్సువాడలో దళారులకు చేపలు అమ్మిన విషయం మాకు తెలియదు. దళారులకు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీపతి, మత్స్యశాఖ జిల్లా అధికారి కామారెడ్డి

కలెక్టరేట్‌కు వెళ్లే అశోక్‌నగర్ రోడ్డు



ఐదు దశాబ్దాలైనా అభివృద్ధి లేదు..

జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ ఏర్పడి దాదాపు 50 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఎక్కడా అభివృద్ధి జాడలు కనిపించడం లేదు. కొత్త బస్టాండ్ పాత జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్, స్థానిక ఎమ్మెల్యే అధికారిక నివాసానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్ల రోడ్డు కాగా.. ఇరువైపులా 20 ఫీట్ల చొప్పున భవన నిర్మాణదారులు కబ్జాలు చేయడంతో 40 ఫీట్ల రోడ్డు మిగిలింది. కబ్జాలపై ప్రశ్నించే ధైర్యం నాయకులకు లేకపోవడంతో ఈ ప్రాంతంలో మురికికాల్వలు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. కొట్టుకుపోయి గుంతలమయమై అధ్వానంగా మారిన రోడ్డుకు సరిగ్గా 100 గజాల దూరంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు భవనం ఉంది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అయితే కామారెడ్డిలో రోడ్డు అభివృద్ధి కావాలని, చేయాలని నిబంధన ఏమీ లేదు కదా.. అని స్థానికులే పేర్కొంటుండడం కొసమెరుపు.

– కామారెడ్డి అర్బన్

రూ.లక్షల నిధులు వృథా

- వాగులో వైకుంఠధామం నిర్మాణం
- ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన స్నానాల గదులు
- తిమ్మాపూర్‌లో ధ్వంసమైన గదులు, ఇప్పటికీ వినియోగించని గ్రామస్తులు


తిమ్మాపూర్ వైకుంఠధామం పరిస్థితి


గాంధారి వైకుంఠధామంలో వరదలకు కూలిపోయిన గదులు

గాంధారి(ఎల్లారెడ్డి): ఎవరైనా వ్యక్తి చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి సరైన స్థలం లేక ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రతి ఊరిలో వైకుంఠధామాలు నిర్మించింది. అయితే కొన్ని గ్రామాల్లో అనువైన ప్రదేశాల్లో నిర్మించగా.. మరికొన్ని గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు, శిఖం భూముల్లో నిర్మించారు. దీంతో వర్షాకాలంలో ఆ వైకుంఠధామాల్లో అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లో నిర్మించిన వైకుంఠధామాలు నీటిలో మునిగిపోగా వాగుల్లో నిర్మించిన వైకుంఠధామాలు వరదలకు ధ్వంసం అయ్యాయి. గాంధారి వాగులో సంగెంరేవు ప్రాంతంలో రూ.లక్షలు వెచ్చించి వైకుంఠధామం నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంత్యక్రియలకు వచ్చిన వారి సౌకర్యార్థం నిర్మించిన స్నానాల గదులు, విశ్రాంతి గది, మరుగు దొడ్లు వరదలకు కొట్టుకుపోయి ధ్వంసం అయ్యాయి. తిమ్మాపూర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామంలో ఇప్పటి వరకు గ్రామస్తులు అంత్యక్రియలకు వినియోగించలేదు. గ్రామస్తులెవరైనా మరణిస్తే వారు పూర్వం నుంచి కులాల వారీగా నిర్వహిస్తున్న ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వేరే గ్రామాల నుంచి వచ్చి గ్రామంలో స్థిరపడిన ఇద్దరు మరణిస్తే వారి అంత్యక్రియలు మాత్రం వైకుంఠదామంలో నిర్వహించారు. కాని వైకుంఠధామంలో నిర్మించిన కంపోస్ట్ షెడ్లు, స్నానాల గదులు, మరుగు దొడ్లు, విశ్రాంతి గది మాత్రం ధ్వంసం అయ్యాయి. ఈదురు గాలులకు వివిధ కారణాలతో రేకులు ఎగిరిపోయాయి. గదులు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయి వృథాగా ఉన్నాయి.

మరమ్మతులు చేయిస్తాం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో వరద ఉధృతంగా వచ్చింది. దీంతో వైకుంఠధామంలో నిర్మించిన గదులు వరద ఉధృతికి కొట్టుకుపోయి ధ్వంసం అయ్యాయి. వాటికి మరమ్మతులు చేయిస్తాం.

– నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, గాంధారి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ట్రెక్కింగ్ శిక్షణ పూర్తి



డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బి అభినయ్, ఎం అక్షయ్ (ఎన్‌సీసీ కేడెట్లు) రాష్ట్రస్థాయి ట్రెక్కింగ్ శిబిరంలో శిక్షణ తరగతులను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎన్‌సీసీ అధికారి, సెకండ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఖత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు శిక్షణ శిబిరం కొనసాగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం మాధవ్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం నుంచి క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 60 వేల క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. 9 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కెప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. తాగు నీటి అవసరాల కు మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 691 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 1090.90 (80 టీఎంసీలు) అడుగుల నీటిమట్టం ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గోదావరి నుంచి ఇసుక తరలింపు



బాల్కొండ: ఇంటి నిర్మాణాల కోసం ఇసుక తిప్పలు ఎక్కువయ్యాయి. దీంతో వాగులు, వంకలు కాకుండ ఏకంగా గోదావరి నుంచే ఇసుకను తరలిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ముందర గోదావరి నుంచి ఇసుకను తీస్తు కుప్పలు వేస్తున్నారు. అనంతరం కుప్పలను తరలిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడంతో వాగుల నుంచి ఇసుకను తీసే అవకాశం లేదు. అంతేకాకుండ ఇసుక తరలింపునకు అనేక అనుమతుల అవసరం ఉండటంతో కనీసం ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడ ఇసుక లభించడం లేదు. దీంతో కొందరు వ్యాపారులు గోదావరి నుంచి ఇసుకను తీస్తూ, వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదావరిలో ఇసుక తరలింపు పక్కదారి పట్టకుండ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

డోంగ్లీలో తాగునీటికి తంటాలు


డోంగ్లీలో పైప్‌లైన్ లీకేజీ అవుతున్న చోట నీరు పట్టుకుంటున్న మహిళలు

మద్నూర్(జుక్కల్) : వేసవి కాలంలో తాగునీటి సమస్య రాలేదు కానీ ఇప్పుడు తాగునీటికి తంటాలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని డోంగ్లీ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో కొద్దిగా నీళ్లు వస్తున్నాయి.. మరికొన్ని కాలనీల్లో అసలుకే నీరు రావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. డోంగ్లీలో గుట్టపై ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా పక్క గ్రామాలకు తాగునీరు అందిస్తున్నా డోంగ్లీలో మాత్రం తాగునీటికి కష్టం అవుతుందని స్థానికులు తెలిపారు. పలుచోట్ల పైప్‌లైన్లు లీకేజీ అవుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన


కామారెడ్డి-సిరిసిల్ల బైపాస్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు రామేశ్వరపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులకు నెల రోజులుగా తాగు నీరు రాకపోవడంతో వారు శనివారం కామారెడ్డి-సిరిసిల్లా బైపాస్ వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ డీఈ, ఏఈ రావాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న దేవునిపల్లి ఎస్సై రంజిత్ తన సిబ్బందితో అక్కడ చేరుకొని డీఈ, ఏఈలను రప్పిస్తానని చెప్పి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం డీఈ హనుమంతరావుకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈ హనుమంతరావు మాట్లాడుతూ.. వారం రోజులలో నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మహిళలకు అండగా, అందుబాటులో షీటీమ్

- నవరాత్రి ఉత్సవాల్లో 19 ఈవ్‌టీజింగ్ కేసులు నమోదు
- సీపీ పోతరాజు సాయిచైతన్య


సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి: మహిళలు, బాలికలకు అండగా నిజామాబాద్ షీటీమ్ 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శనివారం తెలిపారు. దుర్గా నవరాత్రి ఉత్సవాలలో రాత్రి సమయాల్లో మహిళలను ఆకతాయిలు వేధించగా 19 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా షీటీం బృందాలు యువతులకు, విద్యార్థులకు, పని స్థలాలలో మహిళలకు ప్రత్యేకంగా 26 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ నెలలో షీటీం బృందాల ద్వారా 11 ఈ–పెట్టీ కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 80 హాట్ స్పాట్‌లను తనిఖీ చేశామని, పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఏడుగురికీ కౌన్సెలింగ్ ద్వారా కేసులలో పరిష్కారం చూపబడిందన్నారు. ఎవరైనా షీటీమ్ బృందాలను సంప్రదించాలంటే 87126 59795ను సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయి లో పరిశీలించారు. పునాది దశ వరకు నిర్మాణ పను లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కలిసి, వారికి మొదటి విడత బిల్లు మంజూరు అయ్యిందా అని ఆరా తీశారు. పనులు ప్రారంభించని లబ్ధిదారుల తో మాట్లాడి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ , హౌసింగ్ పీడీ పవన్ , డీఈ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేష్, నార్త్ తహసీల్దార్ విజయ్ ఉన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

నిజామాబాద్ రూరల్: ఎన్నికల విధులపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ,సూచించారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అధికారులకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

వైద్య సేవలు, టీకాలు సకాలంలో అందించాలి




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ.. పాల్గొన వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- నగరంలో ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష

నిజామాబాద్ నాగారాం: ప్రజలకు సకాలంలో వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. నగరంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో వివిధ ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మాతా, శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించడం. సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులను వ్యాప్తి చెందకుండా నియంత్రించడం. డెంగీ పాజిటివ్ గుర్తించబడిన ప్రాంతాలలో దోమల నివారణ చర్యలు సహా పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ప్రతి టీం సంవత్సరంలో రెండు సార్లు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబి ముక్త భారత్‌లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్క సిబ్బంది పాల్గొనాలన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులన్నీ అన్ని అనుమతులు పొందిన తర్వాతనే వైద్య సేవలు అందించాలన్నారు. స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీటీసీవో దేవీ నాగేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేష్, సమత, అశోక్, తుకారాం రాథోడ్, రాజు, శ్వేత, భార్గవి, వెంకటేష్, శిఖర తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం అందించరూ!

- ఆర్మూర్‌కు చెందిన శాంతిలాల్‌కు ఫెయిలైన కిడ్నీలు
- వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు
- దాతలు ఆదుకోవాలంటూ కుటుంబికుల వేడుకోలు


ఆదుకోవాలని వేడుకుంటున్న కళ్యాణి, భర్త శాంతిలాల్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన కల్యాణి పట్టణంలోని హెడ్ పోస్ట్‌ఆఫీస్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తుంది. ఆమె భర్త దేదావత్ శాంతిలాల్ రెండు కిడ్నీలు చెడిపోవడంతో గత రెండేళ్లుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్యానికి ఇంకా రూ.లక్షల్లో అవసరం ఉండగా పేదరికం కారణంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఒకరోజు విడిచి మరోజు డయాలసిస్ చేసుకుంటున్నాడు. ప్రస్తుతం ఏ పని చేయలేపోతున్నారు. కాగ కల్యాణి చిన్న కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త వైద్యం కోసం చేసిన అప్పులు పేరుకుపోయాయి. కుటుంబానికి ఎలాంటి ఆసరా లేకపోవడం, పేదరికం కారణంగా అప్పులు తీర్చలేక, భర్తకు మెరుగైన వైద్యం అందించలేకపోతుంది. ఎవరైన దాతలు ముందుకువచ్చి తన భర్తను కాపాడాలని వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం అందించాలనుకునే వారు ఫోన్‌పే నంబర్: 9121744642కు చేయాలని కోరుతున్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి మహిళా కండక్టర్ మృతి


సాయవ్వ (ఫైల్)

బాన్సువాడ: ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడి మహిళ కండక్టర్ మృతిచెందినట్లు సీఐ అశోక్ తెలిపారు. వివరాలు ఇలా.. పిట్లం మండలం కారేగాంకు చెందిన బేగరి సాయవ్వ(49) ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లు అయిపోగా, కుమారుడితో కలిసి కొన్ని నెలలుగా బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో నివాసముంటుంది. శుక్రవారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లిన సాయవ్వ ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు బేగరి సాయిచరణ్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి ఒకరు..


భూపాల్ (ఫైల్)

రాజంపేట: చెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రాజంపేట మండలం పొందుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు, కుటంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. పొందుర్తి గ్రామానికి చెందిన తుడం భూపాల్ (38)కు వివాహం జరుగగా, కొన్నేళ్ల క్రితమే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలు లేరు. దీంతో భూపాల్ మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడు జంగంపల్లి చెరువులో చేపలు పడుతూ తిరిగేవాడు. తరచూ ఇంట్లో చెప్పకుండ వెళ్లిపోయి రెండు, మూడు రోజుల వరకుతిరిగివచ్చేవాడు కాదు. ఈక్రమంలో సెప్టెంబర్ 30న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. శనివారం ఉదయం జంగంపల్లి చెరువులో ఓ వ్యక్తి మృతదేహం కనిపించగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు

క్రైం కార్నర్

ఘటన స్థలానికి చేరుకొని వివ రాలు సేకరించారు. మృతుడిని భూపాల్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. భూపాల్ కాళ్లకు వల చుట్టుకొని ఉండటంతో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి వల చుట్టు కోవడంతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. బస్వాపూర్‌లోని హైవేపై ఉన్న జైకా హోటల్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

పెద్దవాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రాజెక్టు దిగువనున్న పెద్దవాగులో రెండు రోజుల క్రితం గల్లంతయిన వ్యక్తి మృత దేహం శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేట మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన పచింటి శేఖర్ (32) ఈనెల 2న సాయంత్రం చేపలు పట్టేందుకు పోచారం పెద్దవాగు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పోచారం పెద్దవాగులో రెండు రోజుల పాటు గాలించి శేఖర్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. బాల్కొండ ఎస్సై శైలెంధర్ తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండ మంలం వన్నెల్(బి) శివారులోని వరద కాలువలో శనివారం వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అతడి వయస్సు సుమారు 30–40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. అతడే తెల్లషర్టు, నల్లప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతికి నల్ల దారం కట్టింది ఉందన్నాడు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

నవీపేటలో యువకుడి ఆత్మహత్య

నవీపేట: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని తడగామ కాలనీకి చెందిన సిరిసాగర్ రాజయ్య(38) గత కొంతకాలంలో అప్పులతో తీవ్రంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అనిత, కూతురు, కుమారుడు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్: మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. వర్ని మండలం పొట్టిగుట్ట తండాకు చెందిన హీర్యా ఈ నెల 2న రాత్రి బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని బొమ్మన్ దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు హైవేపై గుర్తుతెలియని వాహనం అతడికి ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

బాన్సువాడ: దుర్గామాత నిమజ్జనం సందర్భంగా అనుమతులు తీసుకోకుండా డీజే సౌండ్ సిస్టం పెట్టి ప్రజలకు ఇబ్బందులు కల్గించిన నిర్వాహకులు సాయిప్రసాద్, సల్మాన్‌లపై కేసు నమోదు చేసి, వాహనాలను జప్తు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారిని తహసీల్దార్ వరప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా డీజే పెడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

మెజార్టీ స్థానాలు గెలుపొందాలి

- ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి


డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి

డిచ్‌పల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకునేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి పిలుపునిచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌ఎల్‌జీ గార్డెన్స్‌లో బీజేపీ మండల కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలాగా అంకితభావంతో పని చేయాలన్నారు. వార్డులు, గ్రామాలు, మండలంలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని దినేష్ పటేల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్, మాజీ ఎంపీపీ గడ్డె భూమన్న, పార్టీ మండల అధ్యక్షుడు కర్ని చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ, శ్యాంరావు, సతీష్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, చాకి లక్ష్మణ్, విఠల్, సురేష్, విష్ణు, నారాయణరెడ్డి, గాండ్ల లక్ష్మీనారాయణ, పరుశురాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీపై కాషాయ జెండా ఎగురవేయబోతున్నాం ..

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగురవేయబోతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ధీమా వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో రూరల్ మండల కార్యకర్తల సమావేశంతోపాటు మోపాల్ మండల కార్యకర్తల సమావేశం నర్సింగ్‌పల్లి గ్రామ శివారు ఎస్‌ఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, విజయానికి కృషి చేయాల్సిన విధానాలపై ఆయన కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో పద్మరెడ్డి,జగన్ రెడ్డి, చింత శ్రీనివాస్ రెడ్డి, రవి,గోపి,బిలోజి నాయక్, ఆనంద్, సందీప్, మోపాల్ మండల ఇంచార్జి ప్రమోద్ కుమార్ మండలపార్టీ అధ్యక్షుడు శశాంక్ రెడ్డి, సీనియర్ నాయకులు రవి,బోడ మహేందర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై దాడి చేసిన నిందితుల అరెస్ట్

డిచ్‌పల్లి: అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై మహమ్మద్ షరీఫ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కొరట్‌పల్లితండా శివారులో అటవీ భూమి ఆక్రమణకు గురికాకుండా ఈ నెల 3న బీట్ అధికారి సంగం సతీష్, స్ట్రైకింగ్ ఫోర్స్ వాచర్ హరీష్‌లు పొక్లెయిన్‌తో కందకాల తవ్వకాలు చేపట్టారు. ఈక్రమంలో తండాకు చెందిన ఆలకుంట రాజేందర్, పల్లపు గంగాధర్ అలియాస్ గంగారెడ్డి, కొమిరి రాజ్‌కుమార్ అలియాస్ రాజు అటవీ శాఖ అధికారులపై కర్రలు, రాళ్లతో దాడి చేసి చంపుతామని బెదిరించారు. ఈమేరకు అటవీశాఖ అధికారి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకొని శనివారం కోర్టులో హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931
[HA-16191]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.